

తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ లభ్యం

కామారెడ్డి టౌన్, జూలై 12: కామారెడ్డిలోని డ్రైవర్స్‌కాలనీకి చెందిన ఎండీ బాబర్ కుమారుడు ఉమేర్, సయ్యద్ ఖదీర్ కొడుకు ఆసిఫ్‌లు గురువారం తప్పిపోగా శుక్రవారం ఆచూకీ కనుగొన్నట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు. 12 సంవత్సరాల వయస్సు గల ఉమేర్, 8 సంవత్సరాల వయస్సు గల ఆసీఫ్‌లు గురువారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లారని ఫిర్యాదు రావడంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మహబూబ్ నగర్ రైల్వే పోలీసుల సంరక్షణలో ఉన్నట్లు గుర్తించారు. గురువారం కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి రైలులో మహబూబ్‌నగర్‌కు వెళ్లారని తెలిపారు.



పోస్టింగుల కోసం పైరవీలు

కామారెడ్డి, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓ తహసీల్దార్ ఎన్నికల సమయంలో వేరే జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. అయితే సాధారణ బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో సదరు తహసీల్దార్ తన సొంత జిల్లాకు బదిలీ చేయించుకునేందుకు ఓ మంత్రి చేత పైరవీలు మొదలు పెట్టారు. కలెక్టరేట్‌లోని ఓ శాఖలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ తమ సొంత మండలానికి బదిలీ చేయించుకునేందుకు జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధితో ప్రయత్నాలు ప్రారంభించారు. ఇలా పలువురు అధికారులు ఉద్యోగులు తమకు అనువైన చోటుకు బదిలీ చేయించుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అనువైన ప్రాంతానికి బదిలీ చేయించుకునేందుకు ఎంతైనా ఖర్చు చేయించుకునేందుకు సైతం సిద్ధం అవుతున్నారు. ఇదిలా ఉండగా కొందరు ప్రజాప్రతినిధులు అనుకూలమైన అధికారుల కోసం సిఫారస్‌లు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ కొనసాగుతున్నందున ప్రజాప్రతినిధుల నుంచి ఉన్నతాధికారులకు ఒత్తిళ్లు మొదలయ్యాయి. ప్రధానంగా రెవెన్యూ, పోలీసుశాఖలో బదిలీల పైరవీలు జోరుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగుల్లో బదిలీల సందడి

రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల ప్రక్రియ చేపడుతోంది. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి నెలకొంటుంది. అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 3,800 ల మందికిపైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో గెజిటెడ్ అధికారులు 800 మంది ఉండగా నాన్ గెజిటెడ్ అధికారులు 2500 మంది నాల్గొవ తరగతి ఉద్యోగులు 800ల వరకు ఉన్నారు. అయితే ప్రభుత్వం సాధారణ బదిలీలు చేపడుతున్నందున జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కోలాహలం నెలకొంది. ఇప్పటికే ఉన్నతాధికారులు బదిలీల ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే బదిలీ చేసుకునే ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నేటి నుంచి 18 వరకు దరఖాస్తుల పరిశీలన మాస్టర్ లిస్ట్ సిద్ధం చేయనున్నారు. 19, 20 తేదీల్లో బదిలీల ఉత్తర్వులు కేటాయించిన స్థానాల్లో మూడు రోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

మండల స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు

ఎన్నికల బదిలీల్లో సొంత జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు తిరిగి జిల్లాకు వచ్చేందుకు అవకాశాలను ఆలోచిస్తున్నారు. అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించిన వివిధ శాఖల మండల స్థాయి అధికారుల నుంచి మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు ఎన్నికల బదిలీల్లో భాగంగానే వచ్చిన వారు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్‌లు, ఎంపీడీవో, ఇతర శాఖ అధికారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.

- జిల్లాలో మొదలైన ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ
- అనువైన చోటు కోసం బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నాలు
- అధికార పార్టీ నేతలను కలుస్తున్న అధికారులు, ఉద్యోగులు
- పోస్టింగ్ కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధం
- అనుకూలమైన అధికారుల కోసం అధికార పార్టీ నేతల సిఫారసు
- ప్రజాప్రతినిధుల నుంచి ఉన్నతాధికారులకు బదిలీల కోసం ఒత్తిళ్లు
- ప్రధానంగా రెవెన్యూ, పోలీసుశాఖలో జోరుగా పైరవీలు

దీంతో తమ సొంత స్థలానికి బదిలీ చేయించుకోవాలని ఆలోచిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖల్లో పని చేస్తున్న అధికారులు తమకు అనుకూలంగా ఉండే పోస్టుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎలాగో సాధారణ బదిలీలు చేపడుతున్నందున ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు.

పైరవీలు షురూ

రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ఆదేశించడంతో నచ్చిన చోటుకు బదిలీ చేసుకునేందుకు ఉద్యోగులు, అధికారులు పైరవీలు మొదలుపెట్టారు. పట్టణాలు, కలెక్టరేట్‌ను వీడని అధికారులు, ఉద్యోగులు పైరవీలు చేస్తున్నారు. తమకు ఉన్న పలుకుబడితో ప్రజాప్రతినిధులను కలుస్తూ తమను నచ్చిన చోటుకు బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అనుకూలమైన ప్రాంతానికి పోస్టింగ్ వచ్చేలా ప్రజాప్రతినిధులచేత ఉన్నతాధికారులకు ఒత్తిళ్లు చేస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో పాటు రాజకీయ నేతలు, ప్రముఖ ప్రజాప్రతినిధులు ఇలా ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కీలకమైన స్థానాల్లోనే ఉండేలా కసరత్తు చేస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీవోలు, ఏఈలు, ఏవోలు, ఏపీవోలతో పాటు ఇరిగేషన్, డీఆర్‌డీవో, మున్సిపల్, ఎలక్ట్రిసిటి తదితర శాఖల అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

రెవెన్యూలో ఎక్కువ బదిలీలు అయ్యే అవకాశం

ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన రెవెన్యూ శాఖలో ఎక్కువగా బదిలీలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. స్పెషల్ డ్యూటీ కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్, డీటీ అధికారులకు స్థాన చలనం కలిగే అవకాశం ఉంది. జిల్లా పరిధిలోని పలు మండలాల్లో ఇంటికి దూరంగా పని చేస్తున్న అధికారులు తమ స్థానాల కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. పైరవీల ప్రభావంతో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ దక్కుతుందోనని కొందరు టెన్షన్ పడుతున్నారు. మారుమూల మండలాలతో పాటు ఇతర జిల్లాలకు కలెక్టరేట్‌లో ఆయా సెక్షన్‌ల ఇన్‌చార్జీలుగా ఆర్డీవో, ఆఫీస్ సూపరింటెండెంట్ బదిలీలు కానున్నాయి. కొందరు కలెక్టరేట్‌లో కీలకశాఖల్లో కొన్నేళ్లుగా తిష్ఠ వేశారు. పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా సీట్లు మాత్రం వదలడం లేదు. కొందరు ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని కోరుకున్న చోట కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఇలాంటి అధికారులకు బదిలీలు ఉండాలని తోటి ఉద్యోగులే డిమాండ్ చేస్తున్నారు. జిల్లా పరిధితో పాటు జోన్, మల్టీజోన్ పరిధిలో పని చేస్తున్న అధికారులు అనుకూలమైన చోట పోస్టింగ్ కోసం పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ వస్తుందోనని అధికారవర్గాల్లో చర్చ సాగుతోంది.

ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది

- పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జూలై 12: ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పదోన్నతి కల్పించిందని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఒక్క శాతం నష్టం జరగకుండా అర్హతలను బట్టి 25 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంతో పాటు 68 వేల మంది బదిలీలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. విద్యార్థుల నిష్పత్తి తక్కువ ఉన్న 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయులు, 11-40 వరకు ఇద్దరు, 41-60 వరకు ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించి పాఠశాలలు మూతపడకుండా సీఎం కృషి చేశారని తెలిపారు. తెలంగాణలో ఉన్న టీచర్లందరికీ గతంలో మాదిరిగా పదోన్నతులు కల్పించేలా కొత్త సర్వీస్ రూల్స్ రూపకల్పన చేయడం పీఆర్‌టీయూ ఎజెండాగా పెట్టుకుందని అన్నారు. గురుకులాలు, మోడల్ స్కూళ్లలో పని చేసే వారికి 010 పద్దు ద్వారా వేతనాలు ఇప్పించేలా చూస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

తాగునీటి సమస్యపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 12: తాగునీటి సమస్యపై యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మున్సిపల్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్‌కు సూచించారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిషన్‌భగీరథ నీటి సరఫరా 10 ఎంఎల్‌డీ బదులు 3 ఎంఎల్‌డీ సరఫరా చేస్తున్నట్లు పలువురు కౌన్సిలర్‌లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పారిశుధ్య సమస్య, ఎంక్రోచ్‌మెంట్స్ విషయంలో అభ్యంతరం తెలిపారు. ఎంక్రోచ్‌మెంట్ పోలీసుల సహాయంతో తీసివేయాలని, అనుమతి లేకుండా భవన నిర్మాణం చేపడితే నిర్మాణం చేపట్టకముందు నిలుపుదల చేయాలని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇంటింటి చెత్తసేకరణ 100 శాతం చేయాలని, రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు లేకుండా చూడాలని అన్నారు. ఒక వేళ ఏమైన రోడ్డుపైన చెత్తవేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లతో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలని, కొత్తగా మొక్కలు నాటడంతో పాటు ఇండ్లలో మొక్కలు నాటుటకు సరఫరా చేయాలని తెలిపారు. కౌన్సిల్ సహకారంతో ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్, ప్రకటన పన్నులతో ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా సాధారణ సమావేశంలో 25 అంశాలకు గాను 12వ అంశం వాయిదా వేశారు. మిగితా అంశాలకు ఆమోదం తెలిపారు. కానీ 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన పనులు తీసుకోవద్దని తీర్మానించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

నస్రుల్లాబాద్, జూలై 12 : మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కి మోక్షమెప్పుడో?

- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- ఎన్నికల నేపథ్యంలో హడావుడిగా ప్రారంభం
- రోడ్లపైనే కూరగాయల విక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, ప్రజలు

ఎల్లారెడ్డి, జూలై 12: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అసంపూర్తిగా మిగిలింది. రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం కూరగాయలు, మాంసం విక్రయించేందుకు అధునాతన వసతులతో కూడిన భవన నిర్మాణాన్ని ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హడావిడిగా శంకుస్థాపనలు చేసి నిర్మాణాలు ప్రారంభించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడలేదు. మిగిలి ఉన్న పనులను పూర్తి చేసి మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఎండననక, వాననకా రోడ్లపైనే కూరగాయలు అమ్ముతున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం మొదలు కావడంతో వ్యాపారస్తుల్లో ఆశలు చిగురించినా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇరుకైన రోడ్లు, వాటిపై కూరగాయల అమ్మకంతో రైతులు వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన ఎల్లారెడ్డి ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి నిధుల మంజూరు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు సంవత్సరాల క్రితం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.రెండు కోట్లు మంజూరయ్యాయి. ఒకే చోట కూరగాయలు, మాంసం, విక్రయించేందుకు ఆధునాతన వసతులతో కూడిన భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే పనులు నత్తనడకన సాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో హడావుడిగా భవనాన్ని అసంపూర్తిగా నిర్మించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నాయకుల నిర్లక్ష్యం ఫలితంగా భవనం అసంతృప్తిగా మిగిలిపోయింది. దీంతో వ్యాపారులకు ఇబ్బందిగా మారింది.

చెదిరిన ఆశలు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో వ్యాపారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో వ్యాపారులు, రైతుల ఆశలు చెదిరిపోయాయి. భవనం అసంతృప్తిగా ఉండటంతో వ్యాపారులు, రైతులు కష్టాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయి.

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్ వెనకాల రోడ్డుపై ఇరువైపులా రోజు కూరగాయల అమ్మకాలతో పాటు చికెన్, మటన్‌షాపు సెంటర్ల నిర్వహణ కొనసాగుతోంది. రోడ్డు పక్కనే చికెన్, మటన్, చేపలు సెంటర్ల నిర్వహణ కొనసాగుతోంది. రోడ్ల పక్కనే మాంసం విక్రయాలతో దోమలు విజృంభించి అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దీనిపై దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ నిర్మాణం పనులను పూర్తి చేయించి వ్యాపారులు, రైతులకు అందుబాటులోకి తెస్తే ప్రయోజనం కలుగుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లారెడ్డిలో రోడ్డునే కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

ఎంతో ఆశ పడ్డాం

- దేవిలి, కూరగాయల వ్యాపారి



గత కొన్ని సంవత్సరాలుగా రోడ్లపైనే కూరగాయల వ్యాపారం చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం మంజూరు కావడంతో సంతోషపడ్డాను. ప్రారంభించి నేటికి రెండు సంవత్సరాలైనా అసంపూర్తిగానే భవనం మిగిలి ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా మార్కెట్‌కు త్వరగా నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి.

కష్టాలు తీర్చాలి

- లచ్చవ్వ, కూరగాయల వ్యాపారి




రోడ్లపైనే ఎండనసక, వాననకా కూరగాయలు విక్రయిస్తున్నాను. ఎన్నికల సమయంలో కూరగాయల విక్రయానికి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు తప్ప అమలు చేయటం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

నిధులు విడుదల చేయాలని సీఎంను కోరిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనుల భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని ఇటీవల ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయడం కోసం సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తెలిపారు.

మొత్తం 44 స్టాళ్లు

సమీకృత భవనంలో మొత్తం 44 స్టాళ్లు నిర్మించాల్సి ఉంది. అందులో కూరగాయలు, చిరు వ్యాపారాల కోసం చికెన్, మటన్, చేపలు, పూలు, పండ్ల వ్యాపారుల కోసం 44 స్టాళ్లు నిర్మించాల్సి ఉంది.




ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజం

రెంజల్,జూలై12: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజమని మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగం గౌడ్ అన్నారు. శుక్రవారం దూపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన పీఆర్‌టీయూ మండల కార్యదర్శి సాయిరెడ్డి బదిలీపై వెళ్లడంతో ఆయనను ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12ఏళ్లుగా ఎందరో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది వారి మన్ననలు పొందుతూ ప్రస్తుతం బదిలీపై వెళ్లిన సాయిరెడ్డి సేవలు మరువలేనివన్నారు. సాయిరెడ్డిని శాలువా, పూలమాలలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. తమ పాఠశాలలో అంకిత భావంతో విధులు నిర్వహించి తల్లిదండ్రులు, గ్రామస్థుల మన్ననలు పొందడం జరిగిందని గుర్తుచేశారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో తన కర్తవ్యాన్ని చాటిన వాడన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మి, దేమ్మ, కృష్ణ, సాయన్న, ప్రభాకర్, రాజేశ్వర్, సురేష్, అర్చన, వసంత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

పెర్కిట్, జూలై12: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులు ఫేర్వేల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంబీఏ కోర్సు పూర్తి చేసుకొని బయటకు వెళ్లే విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని క్షత్రీయ విద్యాసంస్థల మంచి పేరు తీసుకు రావాలని విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు డ్యాన్స్‌లు, నృత్యాలు చేస్తూ ఉత్సహంగా గడిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, హెచ్‌వోడీ డాక్టర్ సుధాకర్, క్షత్రీయ మేనేజ్‌మెంట్ పరీక్షిత్, విరేంధర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.





తాను మృతిచెందినా... మరో నలుగురికి ప్రాణం పోసిన యువకుడు


భిక్కనూరు, జూలై 12 : ఇటీవల మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన మండలం లోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్(32) హైదరా బాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మృతుడి స్నేహితులు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిచెందిన అతడి అవయవాలు దానం చేస్తే మరో నలుగురికి ప్రాణదాతగా నిలుస్తాడని ఆసుపత్రి వైద్యులు కుటుంబ సభ్యులను కోరగానే వారు అవయవదానంకు ఒప్పుకున్నారని, అవయ వదానం అనంతరం ప్రవీణ్ మృతదేహానికి ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది ఘనంగా నివాళి అర్పించినట్లు తెలిపారు. కాగా తాను మృతి చెందిన మరో నలుగురికి ఊపిరి పోసిన ప్రవీణ్ మృతదేహాన్ని హైదార బాద్ నుండి అంబులెన్స్‌లో గ్రామానికి తీసుకురాగా గ్రామ సరిహద్దు నుంచి స్నేహితులు, గ్రామస్థులు బైక్‌ర్యాలీతో, టపాసులు కాల్చుతూ ప్రవీణ్ జోహార్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఇంటి వరకు తీసుకెళ్లారు అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో మెదక్ జిల్లా రామాయంపేట, భిక్కనూరుతో పాటుగా మండలంలోని చాలా గ్రామాలనుంచి వందల సంఖ్యలో యువకులు, స్నేహితులు పాల్గొన్నారు.


భిక్కనూరు టీయూ సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థుల ధర్నా

భిక్కనూరు, జూలై 12: భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థులు శుక్రవారం పరిపాలన భవనం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు ఉన్నందున సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. తాము ఎట్టి పరిస్థితుల్లో ఈ సెమిస్టర్ పరీక్షలు రాయబోమని, అధికారులు స్పందించి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూ సౌత్‌క్యాంపస్‌లో పాము కలకలం

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో శుక్రవారం పాము కలకలం రేపింది. సౌత్‌క్యాంపస్ ఆవరణలో ఉదయం పామును గమనించిన విద్యార్థులు హాస్టల్ వార్డెన్, సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు జంగంపల్లి గ్రామానికి చెందిన స్నేక్ స్నాచర్ మోహన్‌రెడ్డికి సమాచారం అందివగానే వెంటనే ఆయన చేరుకుని పామును పట్టుకుని అడవిలో వదిలిపెట్టాడు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా పాముల బెడద ఎక్కువగా ఉంటుందని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించి విషపూరిత, విషరహిత పాములపై విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ యాలాద్రి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







బాగేపల్లిలో ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ సీఐ

రెంజల్, జూలై 12 : మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా బోధన్ సీఐ పవన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని బేబీకుంట చెరువు గట్టుపై ఈతమొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా బాగేపల్లి చెరువు గట్టుపై ఈతమొక్కలను నాటడం జరిగిందని, ఈ మొక్కలను సంరక్షించుకునే బాధ్యత గ్రామస్థులదేనన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఐదు మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జలీల్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు సాయిబాబా గౌడ్, సాయా గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘం భవన నిర్మాణానికి నిధుల మంజూరు

వేల్పూర్, జూలై 12 : మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో దేవాంగ సంఘం కమ్యూనిటీ హాల్‌భవన నిర్మాణానికి రూ.5లక్షల మంజూరయ్యాయి. శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డిలత సహకారంతో మంజూరైన ప్రొసిడింగ్ కాపీని స్థానిక కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, తక్కురి గంగాధర్‌లు దేవాంగ సంఘ సభ్యులకు అందజేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే దిశలో ముందుకుపోతుందని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టువతల నర్సయ్య, నచ్చన్న గారి గంగారెడ్డి, చేపూర్ మోహన్, నెహ్రూ, అలీం, జల్ల భూమన్న, స్టూడియో బాబు, దేవాంగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీయూలో డ్రాయింగ్ పోటీలు

డిచ్‌పల్లి, జూలై 12 : తెలంగాణ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈవెంట్‌లో భాగంగా విద్యార్థులు వివిధచిత్రలు గీశారు. డ్రాయింగ్‌లో గెలుపొందిన వారికి ప్రొఫెసర్ ఆంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. డ్రాయింగ్‌లో ప్రథమ బహుమతి అనూజ, ద్వితీయ బహుమతి పూజ, తృతీయ బహుమతి సుహాసినిలు గెలుపొందారు. కార్యక్రమంలో అధ్యాపకులు హారతి, కైసర్ మహమ్మద్, వాణి, పాల్గొన్నారు.

కోటగిరి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా జానకీరావు

కోటగిరి,జూలై12: కోటగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వై.జానకీరావు ఎన్నికయ్యారు. బోధన్ లయన్స్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పత్తి లక్ష్మణ్, కోశాధికారిగా సాయిశ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని మాజీ డిస్ట్రిక్ గవర్నర్ బసవేశ్వర రావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు హన్మంతరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంక్ మేనేజర్ సేవలు మరువలేనివి'

ఎడపల్లి, జూలై 12 : మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజరు మేఘనకు శుక్రవారం బ్యాంకు ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. మూడు సంవత్సరాలుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహించిన మేఘన ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించి, బ్యాంకును లాభాల్లోకి తీసుకెళ్లి, బ్యాంకు సిబ్బందితోపాటు ఖాతాదారులకు, రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో ఆమె సేవలను కొనియాడుతూ ఆమెకు బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, నాయకులు కామప్ప, అబ్దుల్ వాహబ్ ఖారీ, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు ఉన్నారు.

'దాడి చేయించిన వారిని అరెస్టు చేయాలి'

ఆర్మూర్‌టౌన్, జూలై 12 : నందిపేట మండలం తల్వేద గ్రామానికి చెందిన బొమ్మెన పెద్దపెద్దన్నపై దాడి చేయించిన వారిని అరెస్టు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌లు మాట్లాడుతూ దాడికి ప్రేరేపించిన సాయిరెడ్డి అనే వ్యక్తిపై కేసునమోదు చేయాలని లేని యెడల జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జీ మోత్కు భూమన్న, సీపీఎం డివిజన్ నాయకులు కుతాడి ఎల్లయ్య, సాయిలు, మురళీ, కొండ గంగాధర్, బి.రవి, సుధాకర్, పోసాని, రవీంధర్, నర్సింగ్, అనిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో వివాదాస్పద రోడ్డును పరిశీలించిన అధికారులు

ఆర్మూర్ రూరల్, జూలై 13 : మండలంలోని చేపూర్‌లో వివాదాస్పద జంబి రోడ్డును శుక్రవారం ఆర్మూర్ తహసీల్దార్ గజానన్, సీఐ రవికుమార్‌లు పరిశీలించారు. గ్రామస్తులు సబ్‌స్టేషన్, జంబిపూజకు వ్యవసాయ తోటలకు వెళ్లే దారిని సారంగి విజయ్ అనేవ్యక్తి దౌర్జన్యంగా మూసివేశారని, ఇటీవల గ్రామస్తులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వివాదాస్పద రోడ్డును పరిశీలించి గ్రామస్థులను పూర్తివివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు గతంలోనే ఉందని, గ్రామస్థులు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌కె.చిన్నారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మేడిపల్లి శ్రీకాంత్, కోశాధికారి రుక్మాజీ, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, దాసరి శ్రీకాంత్, శాంతికు మార్, నాగరాజు, సింధూకర్ చరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవీపేట, జూలై 12 : మండలంలోని నిజాంపూర్ 33/11సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని నవీపేట ట్రాన్స్‌కో డీఈ సుహాసిని తెలిపారు. నిజాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నిజాంపూర్, బినోల, ఆశాజ్యోతి కాలనీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని, ఈ విషయంలో వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

స్టూడెంట్స్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం

నవీపేట, జూలై 12 : మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో ఇటీవల జరిగిన స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలలో గెలుపొందిన కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. పాఠశాల హెడ్‌గర్ల్‌గా అనన్య, హెడ్ బాయ్‌గా రాణాప్రతాప్‌లతో పాటు సాంస్కృతిక, క్రమ శిక్షణ, క్రీడా కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, సీఈవో హరితగౌడ్, ప్రిన్స్‌పాల్ భాస్కర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని కాపాడడం ప్రతీ ఒక్కరి బాధ్యత'



సరస్వతి విద్యామందిర్‌లో మొక్కలు నాటుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 12 : పర్యావరణాన్ని కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని సరస్వతి విద్యామందిర్‌లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటడమే గాకుండా నాటిన మొక్కలు సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సంచాల సమితి అధ్యక్షుడు, సీనియర్ బీజేపీ నాయకుడు లోకభూపతిరెడ్డి, పాఠశాల కార్యదర్శి రవినాథ్, ప్రభంధకారిణి కమిటీ అధ్యక్షుడు వంశీ, కార్యదర్శి మహేష్, వైస్‌ప్రెసిడెంట్ జనార్దన్ కిరణ్, ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, అభిమాన్యు, శైలజ, సోనాలి, శ్రీవిద్య, సింధుజ, లత, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో 20న ఊరపండుగ

బోధన్‌రూరల్, జూలై 12 : బోధన్‌లో ఈ నెల 20వ తేదీన ఊరపండుగ నిర్వహించనున్న సందర్భంగా శుక్రవారం బోధన్ గ్రామ నడిబొడ్డున చావిడి వద్ద ముడుపు వేశారు. వారం రోజుల పాటు గ్రామస్థులు గ్రామ ఆచారాలు, సంప్రదాయాలను తప్పకుండా పాటించాలని బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాగారెడ్డి అన్నారు. ఊరపండుగతో గ్రామ దేవతలు శాంతిస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలి

● మధ్యాహ్నభోజన కార్మికుల డిమాండ్

కోటగిరి, జూలై 12 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన కోడిగుడ్లు, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు విఠల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలల నుంచి బిల్లులు రాక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులు తమ వద్ద ఉన్న వస్తువులు, ఆభరణాలను తాకట్టు పెట్టి వంటలు చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులను సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కార్మికులకు 10 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు రమణ, ఉషారాణి, వీరేశం, అలీ, భూమయ్య పాల్గొన్నారు.

వేల్పూర్ :పాఠశాలల మధ్యాహ్న భోజనంకు కోడిగుడ్లు, నిత్యవసర వస్తువులతో పాటు గ్యాస్‌ను కూడా సరఫరా చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునురు చక్రపాణి డిమాండ్ చేశారు. శుక్రవారం వేల్పూర్‌లో ఎంఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అప్పు తెచ్చిన డబ్బులతో కిరాణ దుకాణంలో నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వంట చేసే ముందు కచ్చితంగా కోడిగుడ్లు, రాగిజావా పెట్టాలని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

విద్యుదాఘాతంతో మేకలు, గొర్రెల మృతి

● పశువుల కాపరికి త్రుటిలో తప్పిన ప్రాణపాయం

వర్ని, జూలై 12 : చందూర్ మండల కేంద్రం శివారులో శుక్రవారం విద్యుదాఘాతంతో గొర్రెలు, మేకలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన అరికెల సాయిరెడ్డి అనే వ్యక్తి తన మేకలు, గొర్రెలను మేపుతుండగా చందూర్ గ్రామ బస్టాండ్ శివారులో ఓ పొలం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ తీగల ద్వారా విద్యుత్‌షాక్ తగలడంతో మూడు మేకలు, గొర్రె అక్కడికక్కడే మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు నూటల్‌గా భూమిలో పాతగా విద్యుత్ సరఫరా డైరెక్ట్ అయింది. దీంతో అక్కడే మేస్తున్న మేకలు, గొర్రెలు ప్రమాదానికి గురయ్యాయి. అదే సమయంలో తన గొర్రెలు, మేకలను మేపుతున్న అరికెల సాయిరెడ్డి మిగత మేకల గుంపుకు ఎలాంటి ప్రాణపాయం జరగకుండా వాటిని దూరంగా తరిమేశాడు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగ దగ్గరే ఉన్న సాయిరెడ్డి ప్రమాదాన్ని గ్రహించి పక్కకు దూకడంతో విద్యుత్ షాక్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. తాను ప్రమాదాన్ని గుర్తించకపోతే తనకు కూడా విద్యుత్‌షాక్ తగిలేదని బాధితుడు పేర్కొన్నాడు. ప్రమాద నిర్లక్ష్యానికి కారకులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు. ఈ ఘటనతో తనకు 60 వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు


విద్యుదాఘాతంతో మృతి చెందిన మేకలు, గొర్రెలు

ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి


నాటిన మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

జక్రాన్‌పల్లి, జూలై12: ప్రతీఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం మండలంలోని కలిగోట్ గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా గ్రామంలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. రోజువారిగా మొక్కలు నాటడం వల్ల ఒక కూలీకి ఎంత కూలీ పడుతుందని ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఆదర్శ రైతు రంగు భూమాగౌడ్ వ్యవసాయ క్షేత్రంలో పెరుగుతున్న పంటను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, ఏపీవో రవి, సెక్రె టరీ, ఎఫ్ఏలు, ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం

నవీపేట, జూలై 12 : మండలంలోని స్టేషన్ ఏరియాలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణకు చెందిన ఖాళీస్థలంలో అక్రమ నిర్మాణం బయట పడింది. కార్యాలయం స్థలం ముందు ఉన్న ఇంటి యజమాని అఫ్రోజ్‌ఖాన్ కొన్నినెలల నుంచి పాత బట్టలతో తన ఇంటిని ఆనుకుని ఇరిగేషన్ స్థలంలో అడ్డంగా పరదా కట్టాడు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారులు అంతగా పట్టించుకోలేదు. సంబంధిత పరదా వెనుక అఫ్రోజ్‌ఖాన్ అక్రమ నిర్మాణం చేపట్టాడు. ఈ విషయాన్ని పలువురు స్థానికులు ఇటీవల బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు అక్రమ కట్టడాన్ని మూడురోజుల్లో తొలగించాలని నోటీసులు అందజేశారు. గత రెండున్నర మాసాల క్రితం గ్రామ పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ సైతం అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని అఫ్రోజ్‌ఖాన్‌కు నోటీసులు అందజేశారు. శుక్రవారం ఇరిగేషన్ డీఈ బలరాం, ఏఈ శ్రీధర్, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీల ఆధ్వర్యంలో ఇరిగేషన్ స్థలంలో ఏర్పాటు చేసిన పరదా తొలగించగా దాని వెనుక పిల్లర్లతో పక్కా నిర్మాణం బయట పడడంతో అధికారులు అవాక్కయ్యారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని సిబ్బందితో తొలగిస్తుండగా అఫ్రోజ్‌ఖాన్ కుటుంబానికి చెందిన పలువురు మహిళలు వారికి అడ్డుగా నిలబడడంతో తొలగింపు ప్రక్రియను నిలిపివేశారు. ఇదే సమయంలో జేసీబీని సైతం రప్పించినప్పటికీ దానిని వెనక్కి పంపించారు. లక్షలాది రూపాయల విలువైన ఇరిగేషన్ స్థలంలో గత కొన్ని నెలలుగా అక్రమ నిర్మాణం జరుగుతున్నా పక్కనే కార్యాలయంలో ఉన్న అధికారులు గుర్తించకపోవడం వారి పూర్తి నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఈ సంఘటనతో చర్చించుకుంటున్నారు.


ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణం

టీయూలో పరిపాలనా భవనం ముట్టడి

డిచ్‌పల్లి, జూలై 12 :పోటీపరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 15 నుంచి తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగనున్న పీజీ పరీక్షలు వాయిదా వేయాలని పీజీ విద్యార్థులు శుక్రవారం తెలంగాణ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ముట్టడించారు. సుమారు 2 గంటల పాటు ఆందోళన చేశారు. ప్రభుత్వం పోటీపరీక్షలు నిర్వహిస్తున్న తరుణంలో వర్సిటీ అధికారులు పీజీపరీక్షలు నిర్వహించడం సరి కాదని, పీజీపరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. టీయూ రిజిస్ట్రార్‌ప్రొఫెసర్ యాదగిరి ఎదుట ఆందోళనకు దిగారు. ఆందోళన ఉధృతం కావడంతో సమాచారం అందుకు న్న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్‌లు వర్సిటీకి చేరుకొని విద్యార్థులను శాంతింప జేసేందుకు ప్రయత్నించారు. ఆందోళన కార్య క్రమంలో వర్సిటీలోని అన్ని విభాగాల పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల తేదీలు ప్రకటన

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో 2020-21 విద్యాసంవత్సరం బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షల రెగ్యూలర్ 1,2,3,4వ సెమిస్టర్ పరీక్షల బ్యాక్‌లగ్ పీజు చెల్లించేందుకు ఈ నెల 22 చివరి తేదీ అని, 100 రూ. అపరాద రుసుముతో 23వ తేదీ వరకు చెల్లించుకోవచ్చునని వర్సిటీ సీవోఈ ప్రొఫెసర్ అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

'పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి'

పెర్కిట్, జూలై 12: పిల్లల ఉజ్వల భవిష్యత్‌లో తండ్రిదే కీలక పాత్ర ఉంటుంది. ఈ సందర్భంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామి డిపల్లి నలంద పాఠశాలలో శుక్రవారం పాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థులు వారి ఫాదర్స్‌తో ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. ఈ ఆటల్లో తండ్రులు వారి పిల్లలను ప్రోత్సహించాలి. ఈ సందర్భంగా పిల్లలు తండ్రుల మధ్య అప్యాయతను వెలికి తీసే విధంగా ఈ ఆటలను నిర్వహించామని, అదే విధంగా వారి భవిష్యత్ ఉన్నతంగా ఉండడానికి తండ్రులదే ప్రధాన పాత్ర ఉంటుందని పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ అన్నారు. ఆటలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం అరుంధతి, శ్రావణి, నవనీత, మమత, జ్యోతి, అపూర్వ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

ఆర్మూర్‌రూరల్, జూలై12: చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్మూర్ సీఐ రవికుమార్ అన్నారు. మామిడిపల్లిలోని విజయ్‌హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన అంతర్గత క్రీడాపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి రాణించాలని, అదే విధంగా కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించి రాణించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల దయనైందిన జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర ధృడత్వం పెరగడంతో పాటు మానసికంగా, ఉల్లాసంగా ఉంటుందన్నారు. ఎస్సై అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహ నాలు నడపవద్దని, దీంతో జరగరానిది జరిగితే ఎంతో నష్టపో తారన్నారు. సెల్‌ఫోన్ ఉపయోగం వల్ల కలిగే నష్టాలను వివరిం చారు. ఈ కార్యక్రమంలో విజయ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ అమృతలత, ప్రధానోపాధ్యాయురాలు కవిత దివాకర్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాటు కాలువ కల్వర్టును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు


జన్నేపల్లి మాటు కాలువ కల్వర్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ

నవీపేట్ జూలై 12 : జన్నేపల్లి మాటు కాలువకు సంబంధించిన కల్వర్టును శుక్రవారం ఇరిగేషన్ డీఈ బలరాం పరిశీలించారు. జన్నేపల్లి వద్ద మాటు కాలువకు సంబంధించిన పురాతన కల్వర్టు పైపులతో నిర్మించి ఉండగా నీరుసరిగా ప్రవహించక కాలువకు మధ్యలోనే గండ్లు పడడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని పలువురు రైతులు ఇటీవల బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశం మేరకు శుక్రవారం సంబంధిత కల్వర్టును డీఈ పరిశీలించారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల సమన్వయంతో కల్వర్టు వద్ద పైపులను తొలగించి స్లాబ్ కల్వర్టు నిర్మించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఈ పేర్కొన్నారు. అలాగే సిరన్‌పల్లి సమీపంలో ఉన్న మరో పైపుల కల్వర్టును సైతం స్లాబ్‌కల్వర్టుగా మార్చడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీధర్, లక్ష్మణ్‌రావు తదితరులున్నారు.

కోటగిరిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కోటగిరి, జూలై 12 : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బాబుజగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యాసాగర్, సాయిలు, దినేష్, పోశెట్టి, అబ్బయ్య, లాలయ్య, రవి, మక్కవ్వ, ఈరవ్వ తదితరులు పాల్గొన్నారు.

మొరం టిప్పర్ బోల్తా

కోటగిరి, జూలై12 : పొతంగల్ మండలంలోని హంగర్లఫారం గ్రామ సమీపంలో శుక్రవారం మొరం టిప్పర్ బోల్తాపడింది. సుంకిని రహదారికి మొరం తీసుకువెళ్తున్న వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పల్టీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సాగుచేసిన పంట పొలంలో మొరంటిప్పర్ బోల్తాపడడంతో కాంట్రాక్టర్ మొరం టిప్పర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తీసి పెట్టారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

మోస్రా,జూలై12: ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాగంగా జలాభిషేకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వసుజాతను మర్యాదపూర్వకంగా మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రం విశ్వనాథం, ఎస్‌కే.ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం బ్యాక్‌లాగ్ పరీక్షల్లో విద్యార్థి డిబార్

డిచ్‌పల్లి, జూలై 12 : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీబ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు గురువారం 11వ రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 111 మంది విద్యార్థులకు గాను 102 మంది హాజరయ్యారని, 8మంది గైర్హాజరయ్యరని చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 226 మంది విద్యార్థులకు గాను 216 పరీక్షకు హాజరయ్యారని, 10మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. గిరిరాజ్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒకరు చూచిరాతలకు పాల్పడుతూ డిబార్ అయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బాలుడి మృతి

ఎడపల్లి, జూలై 12 : మండలంలోని రాణాకలాన్ గ్రామానికి చెందిన టేకులపల్లి నవదీప్ (14) అనే యువకుడు ప్రమాదవశాత్తు మరణించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవదీప్ తన ఇంట్లో సామానును ఇంటి పైభాగంలో ఉన్న అటకపైన సర్దుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడడాన్నరు. ఈ క్రమంలో అటక తుదునున్న చీర మెడకు ఉరిలా పడి మృతిచెందాడన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా, కొంతసమాయానికి నవదీప్ తల్లి ఇంట్లోకి వచ్చి చూడగా తన కుమారుడి మెడకు చీర చుట్టుకుని ఉండడంతో వెంటనే హాస్పిటల్‌కు తరలించిందన్నారు. అప్పటికే మృతిచెందాడని డాక్టరు చెప్పాడని ఎస్సై వివరించారు. మృతుడి తండ్రి వినోద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించిన డీఈ

డిచ్‌పల్లి, జూలై 12 : ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో అర్హులైన వారికి జీరోబిల్లుల దరఖాస్తులను డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతికి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అర్హులైన ప్రతి లబ్దిదారుడు జీరోబిల్లులు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాగేపల్లిలో ఈతమొక్కలు నాటిన ఎక్సైజ్ సీఐ

రెంజ్యాల్, జూలై 12 : మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా బోధన్ సీఐ పవన్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని బేబీకుంట చెరువు గట్టుపై ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా బాగేపల్లి చెరువు గట్టుపై ఈత మొక్కలను నాటడం జరిగిందని, ఈ మొక్కలను సంరక్షించుకునే బాధ్యత గ్రామస్థులదేనని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఐదుమొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జలీల్, మాజీసర్పంచ్ సురేందర్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు సాయిబాబా గౌడ్, సాయా గౌడ్, ఫీల్డ్‌అసిస్టెంట్ గోపి, ఎక్సైజ్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం విజయవంతం చేయాలి

ముప్కాల్, జూలై 12 : బాల్కొండ మండలంలో వన మహోత్సవంలో భాగంగా చెట్లు నాటి వాటిని సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారిణి రసూల్‌బీ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో ఆమె మొక్కలు నాటారు. మండలంలోని ఆయా గ్రామాల్లో లక్ష మేరకు మొక్కలు నాటాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏపీవో ఇందిరా, ఎంపీడీవో విజయభాస్కర్, మల్లన్న గుట్ట కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని

నందిపేట, జూలై12: నందిపేట మండల కేంద్రానికి చెందిన ఆకృతి అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. శుక్రవారం నందిపేట హైస్కూల్‌కు చెందిన 1989-90 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు విద్యార్థినికి చేయూత అందించారు. రూ.10 విలువ చేసే మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం ఆకృతిని వారు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సిలిండర్ లింగం, మురళీధర్‌గౌడ్, వినోద్, మోహన్, హన్మాండ్లు, శ్రీనివాస్, తదితరులున్నారు.

సీజ్ చేసిన 1170 బస్తాల ఫర్టిలైజర్ విడుదల

రెంజల్,జూలై12: గత నెల రెంజల్ సొసైటీలో 1170 మందు బస్తాలను మండల వ్యవసాయ అధికారి లక్ష్మికాంత్‌రెడ్డి సీజ్ చేసిన మందు బస్తాలను కలెక్టర్‌కు నివేదిక పంపించడంతో కలెక్టర్ 53,300 రూపాయల జరిమానా విధించడంతో అట్టి జరిమానాను సొసైటీ వారు కట్టడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు 1170 బస్తాల ఫర్టిలైజర్ విడుదల చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి లక్ష్మికాంతరెడ్డి తెలిపారు. ఆయన వెంట సొసైటీ సీఈవో రాము తదితరులున్నారు.

దేవాంగ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు

వేల్పూర్, జూలై 12 : మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో దేవాంగ సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరయ్యాయి. శుక్రవారం. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సహకారంతో మంజూరైన ప్రొసిడింగ్ కాపీని స్థానిక కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, తక్కురి గంగాధర్‌లు దేవాంగ సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టువతల నర్సయ్య, నచ్చన్న గారి గంగారెడ్డి, చేపూర్ మోహన్, నెహ్రూ, అలీం, జల్లభూమన్న, స్టూడియో బాబు, దేవాంగ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, జూలై 12 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలకు దీటుగా చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని పీఆర్‌టీయూ డివిజన్ అధ్యక్షులు శంకర్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని ఊట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ దాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతస్థాయికి వచ్చానని, ప్రభుత్వ పాఠశాలలో విద్య బలోపేతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌లతో మల్లికార్జున్, రవి, ధన్‌రాజ్, ఉపాధ్యాయ బృందం ఉమా, రాధ, సంతోషిణి, వీరేష్ బాబు, తదితరులున్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు 31 వరకు పొడగింపు

బోధన్‌రూరల్, జూలై 12 : హైదరాబాద్ ఎస్సీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అధికారి శశికళ, స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాజా గంగారాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రాత పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం 3లక్షలకు మించరాదని, ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 31వరకు వెబ్‌సైట్‌లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23546552, 7702175493 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

• మండల ప్రత్యేక అధికారి దయానంద్

నసురుల్లాబాద్, జూలై 12: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజ నం అందించాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో, గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలించి మధ్యాహ్నం భోజనం, అనంతరం విద్యార్థు లకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నా రా లేదా అని స్థానిక ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. వన మహోత్సవంలో భాగంగా మైలారంలోని మొక్కలు నాటే కార్యక్రమ ంలో పాల్గొని అనంతరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి, స్థానిక సిబ్బందితో మాట్లాడుతూ గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు సౌకర్యాల మేరకు అందుబాటులో ఉండాలని స్థానిక సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాము, ఏపీవో, టీఏ, ఏఎన్ఎం, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గోవుల అదృశ్యంపై ఫిర్యాదు

బీర్కూర్, జూలై 12 : బీర్కూర్ మండల కేంద్రంలో దేవుడి పేరిట వదిలిన గోవులు అదృశ్యమయ్యాయి. దీంతో గ్రామ పెద్దలు, యువకులు శుక్రవారం పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ దేవుళ్ల పేరిట భక్తులు దానం చేసిన తొమ్మిది గోవులు, నాలుగు పిల్లలు అదృశ్యమయ్యాయి. గోవులు, గేదెలు వ్యాపారం చేసే వారు వాటిని ఎత్తుకుపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీ సులు వారిని పిలిపించి విచారణ చేపట్టాలని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని యువకు లు, పోలీసులను కోరారు.

గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

• ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మీ

దోమకొండ, జూలై 12: మండలంలోని అన్ని గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మీ అన్నారు. శుక్రవారం సంగమేశ్వర్‌లో గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ వచ్చేది వర్షకాలం కాబట్టి గ్రామాల్లో మురికి కాలువలు, రోడ్లు శుభ్రంగా ఉంచేలా కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను గ్రామ పంచాయతీ నుంచి వచ్చే చెత్త బండిలోనే వేయాలన్నారు. ఎవరైన చెత్తను బయట వేస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో రజని, కార్యదర్శి రాహుల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

దోమకొండ, జూలై 12: మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్ అంజాగౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ 5 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని నర్సరీలో పెంచిన మొక్కలు ప్రతీ ఇంటికి 5 చొప్పున పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సీఏ పెద్దమడ్తల రాజు, వనసంరక్షకుడు రాజేల్లయ్య, జీపీ సిబ్బంది నత్తి రమేష్, రామయ్య, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

14న జరిగే బీసీ సభను విజయవంతం చేయాలి

దోమకొండ, జూలై 12: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతిలో ఆదివారం నిర్వహించే బీసీ సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దోమకొండ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం గత ఎన్నికల్లో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చినందున కామారెడ్డి నుంచే జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ యాత్రను ప్రారంభిస్తారన్నారు. కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని వారు పేర్కొన్నారు. కుల గణన జరిగితే బీసీలకు ఖారారయ్యే రిజర్వేషన్ల ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయాలకతీతంగా బీసీ సామాజిక వర్గాలు ఆదివారం జరిగే యాత్ర సదస్సుకు వేలాదిగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో శివరాంలు, మోహనచారి పాల్గొన్నారు.

'భూమిని దున్నిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం'

గాంధారి, జూలై 12: పంట భూమిని దున్నిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. గాంధారి మండలంలోని సోమారం తండాకు చెందిన జన్నుభాయి అనే రైతుకు చెందిన ఫారెస్ట్ భూమి కంపార్ట్‌మెంట్ 754లో మూడు ఎకరాల ఫారెస్ట్ భూమి ఉంది. ఈ భూమిని అటవీ అధికారులు కూడా ధ్రువీకరించారు. గత 20 రోజుల క్రితం ఈ భూమిలో మొక్కజొన్నలు వేయగా గురువారం రాత్రి కొత్తబాది తండాకు చెందిన 50 నుంచి 60 మంది కలిసి 5 నుంచి 6 ట్రాక్టర్లతో ఈ భూమి మొత్తం మాది అని దౌర్జన్యంగా దున్ని పంటను పూర్తిగా నాశనం చేశారు. తండావాసులు గాంధారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం ఎస్‌ఐ ఆంజనేయులు తండాకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జన్ను భాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్, జూలై 12: ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ నవ నిర్మాణ విద్యార్థి సేన అధ్యక్షుడు వినయ్‌కుమార్ అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, సాయిరాం, ఆసీఫ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి వేళాయే!



మొక్కలు నాటడానికి గుంతలు తవ్వుతున్న ఉపాధిహామీ కూలీలు

మద్నూర్,జూలై 12: రాష్ట్రంలో పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. మానవుని మనుగడకు అవసరమైన వాటిలో ముఖ్యమైనవి చెట్లు. కార్బన్ డైయాక్సైడ్‌ను తీసుకుని మానవునికి ప్రాణ వాయువు, ఆక్సిజన్ వదిలే ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలా ప్రోత్సహించనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న హరితహారానికి బదులుగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమంగా నామకరణం చేసి 10వ విడత మొక్కలు నాటడానికి గ్రామాల్లో చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఇటీవల జిల్లా అధికారి చందర్ నాయక్ వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉమ్మడి మండలంలో 1.15 లక్షలు లక్ష్యం

ఉమ్మడి మద్నూర్ మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 34 నర్సరీలలో వివిధ రకాలకు చెందిన సుమారు లక్షా యాభై వేల మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీవో రాణి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ కూలీలతో గుంతలు తవ్విస్తున్నామని ఏపీఎం పద్మ సూచించారు. న్సరీల్లో అడవి జాతి మొక్కలు, పూల మొక్కలు పెంచుతున్నారని, సీమాతంగిడి, అడవి తంగడి, బాదం వంటి, మందారం వంటి మొక్కలు పెంచుతున్నారు.

పంపిణీకి మొక్కలు సిద్ధం

వివిధ రకాల మొక్కలు గ్రామాల్లో ఇంటింటికి పంపిణీ చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గతంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసినప్పటికీ కొందరు వాటిని నాటలేదని తమ దృష్టికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈసారి ఖచ్చితంగా మొక్కలు నాటేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో రోడ్ల వెంట ఇరువైపులా గట్టు ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామ పంచాయతీకి లక్ష్యం విధించి నిర్ణీత సమయంలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మండల ఎంపీడీవో రాణి, ఏపీఎం పద్మ, నర్సరీలను పరిశీలించి కావాల్సిన మొక్కల వివరాలు లిస్టును వారికి అందజేసినట్లు వెల్లడించారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



ఎల్లారెడ్డి కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి, జూలై 12: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ తనిఖీ చేశారు. పాఠశాలలో కిచెన్ రూమ్, స్టోర్ రూమ్, పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థినులకు సమయానికి నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అంజనామూర్తికి తెలిపారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నాగన్నకుంట, రాజులకుంట సర్వేను పూర్తి చేయాలి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని రాజులకుంటను కొందరు కబ్జా చేశారని కొంత మంది రైతుల ఫిర్యాదులు, ఆరోపణల మేరకు గత శనివారం సంఘటన స్థలానికి వెళ్లి కుంటలను పరిశీలించిన విషయం విధితమే. కుంటల సర్వే చేయడంలో ఆలస్యం జరుగుతుందని శనివారం రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్డీవో సర్వేయర్లతో మాట్లాడి బుధవారం లోపు రాజులకుంట శిఖం సర్వే పూర్తి చేసి హద్దులు గుర్తించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. సర్వే చేయడంలో సర్వేయర్లు అలసత్వం చేయడం వల్ల రైతుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి టౌన్, జూలై 12: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, కార్యదర్శి అజయ్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సుమారు 8 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లను ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టి విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లను పెండింగ్‌లో పెట్టిందని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా విడుదల చేస్తది అనుకుంటే విద్యార్థులకు మొండిచెయ్యి చూపుతుందని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ఇవ్వకపోవడం వల్ల విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం కాలేజీ యాజమాన్యాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశపెట్టిందని కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచడం శోచనీయమని అన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మణికంఠ, నాయకులు రాహుల్, నితన్, రాఘవ, ప్రభు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికుల ఇబ్బందులు



నసురుల్లాబాద్ బస్టాండ్

నసురుల్లాబాద్, జూలై 12: ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నసురుల్లాబాద్ మండల పరిధిలోని నిజామాబాద్, బాన్సువాడ, బోధన్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు మండల కేంద్రమైన నసురుల్లాబాద్ బస్టాండ్‌లో కనీసం బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మండల కేంద్రమైన బస్టాండ్‌లో చుట్టు పక్కల మండలాల నుంచే కాకుండా ఇతర గ్రామాల నుంచి వచ్చి ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తుంటే, సమయానికి బస్సులు రాకపోవడంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే మండల పరిధిలోని కంశెట్‌పల్లి, దుర్కి గ్రామాల్లో, బస్టాండ్‌లు శిథిలావస్థలోకి చేరడంతో కనీసం నిల్చుందామంటే నీడ లేక రోడ్డుపైనే గంటల తరబడి నిల్చుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, గ్రామాల్లోని బస్టాండ్‌లల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, శిథిలావస్థలోకి చేరిన బస్టాండ్, మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే నూతనంగా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా ప్రజల సౌకర్యాలు పట్టించుకోవడం లేదని, నిత్యం ప్రయాణించే ప్రయాణికుల ఇబ్బందులు గమనించి ఆర్టీసీ అధికారులు ప్రజలకు ఆర్టీసీ ప్రాంగణంలో మరుగుదొడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులకు మరింత చేరువగా రైతు నేస్తం

• ఎల్లారెడ్డి రైతు వేదికకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ మంజూరు
• ఇకపై అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో అన్నదాతలకు సలహాలు



నూతన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్

ఎల్లారెడ్డి, జూలై 12: రైతు వేదికలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని విస్తృత పరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలానికి ఒకటి చొప్పున రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను మంజూరు చేసింది. ఈ క్రమంలో మొదటి విడతగా ఎల్లారెడ్డి మండలంలోని మీసన్‌పల్లి, రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. అప్పట్లో ప్రయోగాత్మకంగా తొలుత ప్రతి నియోజకవర్గంలో ఒక రైతు వేదికకు మాత్రమే కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి అధికారుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. దీంతో రైతులకు మరింత చేరువగా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. దీంతో ఒక్కో రైతు వేదికకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ మంజూరు చేసింది. వచ్చే నెల మొదటి వారంలోగా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

సలహాలు, సూచనలు పొందవచ్చు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంటల సాగు, రుణాలకు సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్న త్వరగా పరిష్కారం అయ్యేందుకు శాస్త్రవేత్తలు సంబంధిత అధికారులు రైతులకు వివరిస్తారు. ఆయా పంటల సాగు చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారు. అదే విధంగా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఎంతో మోతాదులో వేయాలని దానిపై సంబంధించి అధికారులు సూచనలు ఇస్తారు.

రైతులకు ఎంతో మేలు

• హరీష్, వ్యవసాయ అధికారి, ఎల్లారెడ్డి

ప్రస్తుతం రైతు వేదికలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక సాంకేతిక వ్యవస్థ ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరనుందని ఎల్లారెడ్డి వ్యవసాయ అధికారి హరీష్ తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పంటల సాగులో మెలకువల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా వ్యవసాయంతో పాటు ఉద్యాన వన, మత్స్య, పశు సంవర్ధక, విద్యుత్, నీటి పారుదల శాఖలకు సంబంధించిన సమాచారం తెలుసుకునే వీలుంటుంది. త్వరలో ఈ సౌకర్యం రైతులకు అందుబాటులోకి రానుంది.



కామారెడ్డిలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వాసవిమాత ఆలయంలో కుంకుమార్చన

కామారెడ్డి టౌన్, జూలై 12: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవిమాత మహిళ పారాయణ, వాసవమాంబ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దఎత్తున కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. 200ల మందికి పైగా మహిళలు 108 కిలోల కుంకుమతో 102 గోత్రనామాలతో కుంకుమార్చనలు నిర్వహించారు. తదనంతరం అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో మంగళహారతుల నీరాజనం ఇచ్చారు.

ఘనంగా సంతోషిమాతా ఆలయ వార్షికోత్సవం

భిక్కనూరు, జూలై 12: మండల కేంద్రంలోని సంతోషిమాతా ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తీరొక్కపూలతో అలంకరించి అమ్మవారికి వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లోక కల్యాణార్థం నవీన్‌శర్మ ఆధ్వర్యంలో పెద్దఎత్తున హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కాగా మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గజవాడ నాగరాజు, గౌరవ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న దృశ్యం

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

• మండల ప్రత్యేక అధికారి రజిత

భిక్కనూరు, జూలై 12: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారిణి రజిత సూచించారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంతో పాటుగా, భిక్కనూరు గిద్ద హరిజనవాడలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో టైర్లలో నీరు ఉండటాన్ని గమనించి నీటిని పారబోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న కారణంగా దోమలు ప్రబలి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడాల్సి వస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరంర పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవో మహేష్‌గౌడ్, కార్యదర్శి దయాకర్, పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

గాంధారి, జూలై 12: మండలంలోని నేరల్ గ్రామానికి చెందిన హరిజన నవీన్(27) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. తన ఇంట్లో ఫ్యాన్ తిరగడంలేదని ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతి వేలికి కరెంట్ షాక్ తగలడంతో పక్కనే ఉన్న గోడపై పడి తలకు గాయం అయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే అతని గాంధారిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వచ్చే సరికి అప్పటికే చనిపోయినట్లు వైద్యుడు తెలిపారు. మృతుడి తల్లి హరిజన్ యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య

నిజాంసాగర్, జూలై 12: నిజాంసాగర్ మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన అడ్డగాళ్ల సాయిలు(20) ఎలాంటి పని చేయక గత కొంత కాలంగా ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మృతుడి తండ్రి సంజీవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లచ్చన్‌లో బోనాల సందడి



లచ్చన్‌లో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మద్నూర్, జూలై 12: తెలంగాణ ప్రజలు సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరుపుకునే ప్రధాన పండుగల్లో బోనాల పండుగ ప్రత్యేకమైనది. మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామంలో శుక్రవారం గ్రామస్థులు సామూహికంగా బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు బోనాలతో అమ్మవారికి సమర్పించడానికి డప్పు చప్పుళ్లతో బయలుదేరారు. బోనం కుండకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి వేపాకులను మాలలుగా చుట్టి తయారు చేశారు. ఊరేగింపులో శివ సత్తుల శివాలు, పోతురాజుల విన్యాసాలు ఎంతో ఆకర్షించాయి. ఊరేగింపుగా బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలను సమర్పించారు. అనంతరం గ్రామంలోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని లచ్చన్ గ్రామంలో గ్రామస్థులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి మేకపోతులను బలి ఇచ్చారు. వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని, గ్రామం బాగుండాలని, కుటుంబాలు చల్లగా ఉండాలని, పిల్లా పాపలు ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు. ప్రతీ ఏడాది అమ్మవారి మొక్కులను తీర్చుకోవడానికి సామూహికంగా గ్రామంలో బోనాల పండుగ నిర్వహిస్తుంటారు. ఆనవాయితీగా వస్తున్న బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- ఓసీ
దర్శన్	- భారతీయుడు-2
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	- కల్కి
వెంకటేశ్వర	- మహారాజ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

